
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 30 సెప్టెంబరు 2025

ఇది పొరపాటు సారూ..!

మృతి చెందిన ఉపాధ్యాయుడికి ఎన్నికల విధుల ఆర్డర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏడాది కిందట మృతి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి రేపటి స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు కేటాయిస్తూ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఆర్డర్ జారీ చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొడ్డుపల్లి శంకర్ 2024 సెప్టెంబరులో అనారోగ్యంతో మృతి చెందారు. మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహించిన ఆయనకు తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలకు ఒక రోజు ముందే అంటే ఈ నెల 28న జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి విధులు కేటాయిస్తూ ఆర్డర్ జారీ చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణకు హాజరుకావాలని మృతి చెందిన ఉపాధ్యాయుడి ఇంటికి వచ్చిన ఆర్డర్ చూసి కుటుంబసభ్యులు అవాక్కయ్యారు.


మరిపెడ సద్దుల బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న మహిళలు


బయ్యారంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మ..!

- జిల్లాలో ఘనంగా సద్దుల బతుకమ్మ
- విద్యుత్ కాంతుల నడుమ మహిళల కోలాటాలు
- పూలవనంగా మారిన మానుకోట
- వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ ఎమ్మెల్సీ ..



తంగేడు.. బంతి.. చామంతి.. గునుగు.. కలువ ఇలా తీరొక్క పూలతో మానుకోట మురిసిపోయింది. వివిధ ఆకృతుల్లో తయారు చేసిన బతుకమ్మ మహిళల ఆలోచన.. అభిరుచిని గుర్తు చేశాయి. ఎంగిలిపూలతో మొదలైన పూల జాతర సద్దుల బతుకమ్మతో ముగిసింది. సద్దుల బతుకమ్మను మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మహిళలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 21న ఎంగిలిపూలతో ఆరంభమైన బతుకమ్మ వేడుకలు 9వ రోజు సోమవారం సద్దుల బతుకమ్మతో ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయాలు, దేవాలయాల్లో నిర్వహించుకున్న బతుకమ్మను చివరి రోజు పల్లెలు, పట్టణ శివారు చెరువుల వద్ద పండుగను జరుపుకుని బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్

8


మహబూబాబాద్ నిజాం చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మహిళ


కేసముద్రం పెద్ద చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

స్థానిక సమరానికి సై

- రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ
- మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

దసరాకు ముందే నోటిఫికేషన్‌తో జోష్



మహబూబాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సమరానికి నగారా మోగింది... రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతోనే ఒక్కసారిగా మహబూబాబాద్ జిల్లా రాజకీయాలు వేడెక్కాయి. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే జిల్లాలోని 18 మండలాల్లో 18 జడ్పీటీసీలు.. 193 ఎంపీటీసీల రెండు దశల్లో, 482 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు.. 4110 వార్డు సభ్యులకు మూడు దశల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పార్టీల గుర్తులతో నిర్వహించనుండగా.. పంచాయతీ ఎన్నికలు మాత్రం పార్టీ రహిత గుర్తులతోనే నిర్వహించనున్నారు.

ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్ 23, 27 తేదీల్లో రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో మూడు దశలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తుది ఫలితాలు వెల్లడించాలని సంఘం నిర్ణయించింది. సోమవారం మధ్యాహ్నం లోగానే ఈ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఒక వైపు సద్దుల బతుకమ్మ సందడిలో మహిళలు ఉండగా.. మరోవైపు రాజకీయ పార్టీలు చోటా.. మోటా నాయకులు ఎన్నికలకు సమయాత్తమయ్యే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు ఇలా..

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
మహబూబాబాద్	బీసీ జనరల్	బీసీ జనరల్
కురవి	ఎస్టీ మహిళ	బీసీ మహిళ
సీరోలు	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
కేసముద్రం	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
ఇనుగుర్తి	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
డోర్నకల్	ఎస్టీ జనరల్	బీసీ మహిళ
నర్సింహులపేట	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
చిన్నగూడూరు	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
పెద్దవంగర	ఎస్సీ జనరల్	బీసీ జనరల్
దంతాలపల్లి	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
నెల్లికుదురు	బీసీ జనరల్	ఎస్సీ మహిళ
తొర్రూరు	బీసీ మహిళ	బీసీ మహిళ
మరిపెడ	బీసీ మహిళ	బీసీ జనరల్
బయ్యారం	బీసీ మహిళ	ఎస్టీ మహిళ
కొత్తగూడ	బీసీ జనరల్	ఎస్టీ జనరల్
గూడూరు	బీసీ జనరల్	జనరల్
గంగారం	జనరల్	ఎస్టీ జనరల్
గార్ల	జనరల్ మహిళ	ఎస్టీ మహిళ

దసరా ముందే నోటిఫికేషన్‌తో..

జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ సరిగ్గా సద్దుల బతుకమ్మ నాడు విడుదల కావడంతో ఈ సారి దసరా ధూం.. ధాంలకు మరింత జోష్ పెరిగింది. వార్డు సభ్యులు మొదలుకుని సర్పంచ్.. ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ ఛైర్మన్ పదవులకు ఆశపడుతున్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ ఫాలోవర్స్‌ను చేజారిపోకుండ చూసుకోవడంతో పాటు ఓటర్లను కూడ మచ్చిక చేసుకునే

(మిగతా 8లో..)

మద్యం టెండర్ల దరఖాస్తులు షురూ

దరఖాస్తు చేసిన గుంటూరు మహిళ

6

ముగిసిన పవర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు



డోర్నకల్‌లో పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న మహేందర్‌కుమార్‌జైన్, రామకోటేశ్వర్‌రావు

డోర్నకల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు సోమవారం ముగిసాయి. బాలుర సబ్ జూనియర్ విభాగంలో 53 కేజీల విభాగంలో చరణ్ ప్రథమ స్థానం, ఎస్‌కె.ఇమామ్ ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో లక్ష్మణ్ ప్రథమ స్థానం, రాంచరణ్, ద్వితీయ స్థానం, 59 కేజీల కేటగిరిలో సబ్ జూనియర్స్ విభాగంలో జశ్వంత్ ప్రథమస్థానం, వీరేష్ ద్వితీయ స్థానం, సుధీర్ తృతీయ స్థానం సాధించారు. బాలుర విభాగంలో దినేష్ ప్రథమ, వంశీ ద్వితీయ, షఫీ తృతీయ స్థానం, 59 కేజీల విభాగంలో మొగిలి ప్రథమస్థానం, కీర్తివరుణ్ ద్వితీయస్థానం, నవనీత్ తృతీయ స్థానం, జూనియర్స్ విభాగంలో అఖిల్ ప్రథమ, ప్రమోద్ ద్వితీయ, యశ్వంత్ తృతీయ, 66 కేజీల సీనియర్స్ విభాగంలో కార్తీక్ ప్రథమ స్థానం సాధించారు. ఆయా కేటగిరిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపుపొందిన వారికి ప్రముఖ వ్యాపారి కాల మహేందర్‌జైన్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో జాతీయస్థాయి మాజీ వెయిట్ లిఫ్టర్లు ఎం.రామకోటేశ్వర్‌రావు, బుట్టి అశోక్‌కుమార్, మారబోయిన లక్ష్మీనారాయణ, రాంభద్రం, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

చీరెలు పంపిణీ



గిరిజన మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న రమేశ్‌నాయక్

మరిపెడ రూరల్ 29 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ పర్వదినాన కేర్ సేనా ఫౌండేషన్ ఛైర్మన్ వడ్త్య సాయికుమార్, డైరక్టర్ వడ్త్య రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆ ఫౌండేషన్ సభ్యుడు కృష్ణనాయక్ రూ.3లక్షలు విలువైన మూడు వందల చీరలను సోమవారం గిరిజన మహిళలకు పంపిణీ చేశారు.ఉమ్మడి తానంచర్ల పరిధిలోని కోట్యా, అజ్మీరా, చౌళ్ల, వాల్య తండా గిరిజన మహిళలకు చీరెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.దసరా పర్వదినాన పేదలైన గిరిజనులు కొత్త చీరలు ధరించి బతుకమ్మ వేడుకలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తేజావత్ లింగ్యానాయక్, రాజరాంనాయక్, మల్సూర్, హీన్న, పండు, రవీందర్, వెంకన్న, ఎన్. నరేష్, టీ వెంకన్న, బాల, రాజేష్, మోహన్, గణేష్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లు ఖరారు

● మరిపెడ జడ్పీటీసీ బీసీ మహిళ, ఎంపీపీ బీసీ జనరల్

మరిపెడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌ల రిజర్వేషన్లను అధికారికంగా ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం అధికారికంగా గెజిట్ విడుదల చేశారు. మరిపెడ జడ్పీటీసీ బీసీ ఉమెన్, ఎంపీపీ బీసీ జనరల్‌కు కేటాయించారు. మండలంలోని 15 ఎంపీటీసీల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి. అబ్బాయిపాలెం, బుర్హాన్‌పురం, ఎడ్జర్ల, గుండెపూడి ఎంపీటీసీ స్థానాలు ఎస్టీ జనరల్, చిల్లంచర్ల, తాళ్లాకల్, ఎల్లంపేట ఎస్టీ మహిళలకు కేటాయించారు. ఆనేపురం, నీలికుర్తి, ఉల్లెపల్లి బీసీ జనరల్, తండాధర్మారం, రాంపురం బీసీ మహిళలకు, తానంచర్ల జనరల్ మహిళ, సోమ్లాతండా, వీరారం జనరల్‌కు కేటాయించారు.

సర్పంచుల రిజర్వేషన్లు ఇలా ..

మరిపెడ మండలంలో మొత్తం 48 జీపీలు ఉండగా భూక్యా తండా, బురికితండా, చింతలగడ్డ తండా, దంటకుంటతండా, లచ్యాతండా, లూనవత్‌తండా, పాంబండతండా, రేఖ్యతండా, సోమ్లాతండా, బీచ్‌రాజ్‌పల్లి, గిరిపురం, గుండెపూడి, ఎల్లారిగూడెం జీపీలు ఎస్టీ మహిళలకు కేటాయించగా అజ్మీరాతండా, బాల్యా తండా, బోట్యాతండా, డీఎస్ఆర్ జెండాల తండా, కోట్యాతండా, లక్మాతండా, మూలమర్రితండా, రూప్‌సింగ్‌తండా, వాల్యాతండా, యలమంచలితండా, అబ్బాయిపాలెం, బాబోజీగూడెం, ఎడ్జర్ల, తండాధర్మారం జీపీలు ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. బుర్హాన్‌పురం, పురుషోత్తమాయగూడెం, ఉల్లెపల్లి ఎస్సీ మహిళలకు, తాళ్లాకల్, తానంచర్ల వీరారం ఎస్సీ జనరల్‌కు కేటాయించడం జరిగింది. అమ్మనాయక్‌తండా, భాల్నీధర్మారం, గాలివారిగూడెం, నీలికుర్తి, స్టేజీతండా, వెంకట్యాతండా జీపీలు బీసీ మహిళలకు, అజ్మీరాతండా, ఆనేపురం, ధరావత్‌తండా, నేతవత్‌తండా, రాంపురం, వెంకంపాడు బీసీ జనరల్‌కు కేటాయించారు. గుర్రప్పతండా జనరల్ ఉమెన్, చిల్లంచర్ల, ఎల్లంపేట జనరల్‌కు కేటాయించడం జరిగింది. కాగా ఏ జీపీకి ఆ జీపీలో సగం వార్డులు మహిళలకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు.

డీఎస్పీగా ప్రజల మన్ననలు పొందాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నవీన్‌రావు

మరిపెడ రూరల్ 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా డీఎస్పీకి ఎంపికైన జాటోతు విజయ్ ప్రజల మన్నలను పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గుడిపుడి నవీన్‌రావు ఆకాంక్షించారు. సోమవారం మండలంలోని బీచ్‌రాజ్‌పల్లిలో నవీన్‌రావును గ్రూప్-1లో డీఎస్పీగా సెలెక్ట్ అయిన మరిపెడ మునిసిపల్ కేంద్రం శివారు ఆర్లగడ్డ తండాకు చెందిన జాటోతు విజయ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌ను శాలువతో నవీన్‌రావు సన్మానించారు. డీఎస్పీ శిక్షణాంతరం ప్రజలకు రక్షణగా, న్యాయ బద్ధంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుడిపుడి మంజుల, జాటోతు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



విజయ్ కుమార్‌ను అభినందిస్తున్న రెడ్యానాయక్

రెడ్యా అభినందనలు

చిన్నగూడూరు (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపాలిటీ పరిధిలోని ఆర్లగడ్డ తండాకు చెందిన బాలాజీ-భద్రమ్మ దంపతుల కుమారుడు జాటోతు విజయ్‌కుమార్ ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగం సాధించిన సందర్భంగా సోమవారం ఉగ్గంపల్లి రెడ్యా స్వగృహంలో విజయ్‌ని అభినందించారు. అనంతరం విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు రెడ్యానాయక్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆయూబ్, లక్ష్మీ రెడ్యానాయక్ ఉన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా రుణసేవలు

● టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలలోని సభ్యులు, బ్యాంకు ఖాతాదారులకు వ్యవసాయ రుణాలే కాకుండా ఇతర వాణిజ్య బ్యాంకులకు దీటుగా అన్ని రకాల రుణసేవలు అందించడం జరుగుతుందని టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. మండలంలోని నందనం రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎస్‌సీఎస్) 54వ మహాజన సభ సర్వసభ్య సమావేశం సోమవారం కార్యాలయం ఆవరణలో జరిగింది. బ్యాంకు పరిపాలన, నివేదిక, ఆర్థిక సంవత్సరం బ్యాంకు, సొసైటీ జమ ఖర్చులు, లాభనష్టాలు, ఆస్తులు, అప్పులను మహాజన సభలో ప్రవేశపెట్టి సమీక్షించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీందర్‌రావు మాట్లాడుతూ సొసైటీలోని సభ్యులకు, బ్యాంకు ఖాతాదారులకు ఉచితమైన సేవలు అందిస్తున్నామని వివరించారు. డిపాజిట్ల మీద ఇతర బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీలు చెల్లిస్తున్నామని తెలిపారు. సొసైటీ మార్ట్(సూపర్ మార్కెట్) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.3.50లక్షల ఆదాయం లభించిందని, యాసంగి ధాన్యం కొనుగోలు ద్వారా రూ.21.90లక్షల కమీషన్ రావాల్సి ఉందన్నారు. గోల్డ్ లోన్స్, క్రాప్ లోన్స్ కర్షకమిత్ర లోన్స్, మార్ట్ బిజినెస్, సీడ్స్ అమ్మకాలు, పంథిని గోదాము, అంబేద్కర్‌నగర్ ఫంక్షన్ హాల్ నిర్వహణ నందనం సొసైటీ ద్వారా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ ఛైర్మన్ టి.చందర్‌రావు, డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, ఎలేంద్ర, రామచంద్రం, ఏసోబు, సంపత్‌రావు, కుమార్, బాబు, పద్మ, సీఈవో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎవరికి కేటాయించలేదు



ఇండ్ల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

తొర్రూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో దుబ్బ తండా వద్ద నిర్మించి ఉన్న 284 డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎవరికీ కేటాయించ లేదని, ఆ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తొర్రూరు తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపి ఇండ్ల వద్ద ప్రత్యేక బ్యానర్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన వారందరికీ ఇళ్ల పంపిణీ జరుగుతుందన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఇళ్లకు తాళాలు వేసి ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదు



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

తొర్రూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీతో కలిసి అడిషనల్ కలెక్టర్ అనిల్‌కుమార్‌కు జిల్లా కేంద్రంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయాలని గత 6 నెలలుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని, సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇండ్లు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నగూడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి రెడ్యానాయక్ పరామర్శించారు. ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కట్లరాజు సోదరుడు షంబులింగం ఇటీవల చిన్నగూడూరులో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎమ్డీ.ఆయూబ్ పాషా, ధారాసింగ్, గండి ఉపేందర్, పిల్లి శ్రీరాములు తదితరులు ఉన్నారు.

గూడూరులో ఫ్లెక్సీల తొలగింపు



గూడూరులో ఫ్లెక్సీలను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రావడంతో గూడూరు మండల కేంద్రంలో అధికా రులు అలర్ట్ అయ్యారు. పండుగ సందర్భంగా బతుకమ్మ, దసరా వేడుకల దృష్ట్యా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకు లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించారు. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎలాంటి ప్రచారాలు నిర్వహించకూడదని అధికారులు సూచించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల కమీషన్ ప్రభుత్వ ఆదేశాలు.. నిబంధనల ప్రకారం.. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ జిల్లాలోని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నుంచి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో 193 ఎంపీటీసీ, 18 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 22 మంది ఆర్వోలు, 22 మంది అసిస్టెంట్ ఆర్వోలను నియమించి శిక్షణ పూర్తి చేశామన్నారు. 1066 పోలింగ్ కేంద్రాలు నిర్ణయించి ప్రభుత్వ గెజిట్ ప్రకారం రెండు దఫాలుగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. 482 గ్రామపంచాయతీలకు మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహిస్తామని, 182 మంది ఆర్వోలు, 578 అసిస్టెంట్ ఆర్వోలను నియమించి 4110 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల నియామవళి పక్కాగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీపీవో హరిప్రసాద్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ , పక్కన ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

దినసరి వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మరిపెడ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ దగ్గర ధర్నా చేస్తున్న ఆశ్రమ స్కూల్స్, హాస్టళ్ల డైలీవేజ్ వర్కర్లు, సీఐటీయూ నేతలు

మరిపెడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రమ స్కూళ్లు, హాస్టళ్లలో డైలీవేజ్‌గా పని చేస్తున్న వర్కర్ల దుస్థితి నేడు అగమ్యగోచరంగా మారిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీఐటీయూ, ఆశ్రమ స్కూల్స్, హాస్టళ్ల డైలీవేజ్ వర్కర్లు మరిపెడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ దగ్గర మోకాళ్లపై నిలుచొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ డైలీవేజ్ వర్కర్ల అందరిని పర్మనెంట్ చేస్తామని చెప్పి ఇప్పుడు వారికి వేతనాలు ఇవ్వక పండుగ పూట పస్తులు ఉంచుతున్నారని విమర్శించారు. పాత పద్ధతిలో డైలీవేజ్ వర్కర్లకు వెంటనే వేతనాలు ఇవ్వాలని, ఇప్పటి వరకు పెండింగ్‌లో పెట్టిన వేతనాలన్ని విడుదల చేసి ఆ పేద కుటుంబాలను ప్రభుత్వం సత్వరం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే సీఐటీయూ ఆధ్వర్యం లో ఆందోళనలు ఇంకా ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో దుండి వీరన్న, డైలీవేజ్ వర్కర్స్ జేఏసీ అధ్యక్షుడు గుగులోత్ రవీందర్, ఎస్‌కే. తాజోద్దీన్, జితేందర్, ముత్తయ్య, లింగన్న, శోభ, మంగమ్మ, సురేశ్, సోమన్న, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్ల దరఖాస్తులు షురూ

దరఖాస్తు చేసిన గుంటూరు మహిళ

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2025-27 రెండేళ్ల కాల పరిమితిమికి మద్యం టెండర్లు ఈ నెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగా, సోమవారం జిల్లాలో మద్యం టెండర్లకు రెండు దర ఖాస్తులు చేశారు. మరిపెడ మునిసిపల్ పరిధిలోని షాప్ నెంబర్ 31కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన మహిళ ఆమంచి శ్రీదేవి తొలి దరఖాస్తు చేసుకున్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని షాప్ నెంబర్ 09కి బయ్యారానికి చెందిన కొత్త రవి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా సోమవారం రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారి కిరణ్‌నాయక్ తెలిపారు.



గుంటూరుకు చెందిన మహిళ దరఖాస్తును స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్‌కు దరఖాస్తు అందిస్తున్న కొత్త రవి

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో 2020 నుంచి 2025 వరకు ఇంజనీరింగ్ డిప్లొమా ఏదైనా గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుంచి టెక్నికల్ నాన్ టెక్నికల్ డిప్లొమా అప్రెంటీస్ పోస్టుల కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సోమవారం వరంగల్ ఆర్ఎం డి.విజయభాను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబరు 7న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హనుమకొండ సిటీ బస్ స్టేషన్‌లోని రెండో అంతస్తులో ఆర్ఎం కార్యాలయంలో అభ్యర్థులు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని రావాలని పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ : 99592 26045 కు సంప్రదించాలని కోరారు.

కేసముద్రం మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు



కేసముద్రం, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ కమిషనర్‌గా టి.శ్రీనివాసరావు సోమవారం విధుల్లో చేరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ)గా పనిచేస్తున్న ఆయన్ను డిప్యూటేషన్ ప్రాతిపదికన ఫారిన్ సర్వీసెస్ నిబంధనలతో ఇక్కడ కమిషనర్‌గా నియమిస్తున్నట్లు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వ కార్యదర్శి టి.కె.శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మునిసిపాలిటీ కార్యాలయంలో విధుల్లో చేరారు.

టీబీ నిర్మూలనలో భాగస్వాములు కావాలి

జిల్లా క్షయ నిర్మూలన ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్



క్షయ రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

గార్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీబీ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు తమ వంతు కృషి చేయాలనే సంకల్పంతో ముందుకు రావాలని జిల్లా క్షయ నిర్మూలన ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో దాతల సహకారంతో 29 మంది టీబీ రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. బలమైన ఆహారం తీసుకుంటే టీబీ అంతం చేయవచ్చునన్నారు పోషకాహార కిట్లను అందజేసిన దాతలకు ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్లు శివకుమార్ నవీన్ కుమార్, హనుమంతరావు. సిబ్బంది శ్రీహరి, అచ్చ నవీన్ కుమార్, స్వాతి, విజయలక్ష్మి, అశోక్, దాతలు లక్ష్మణ్ నాయక్, లింగాల ఉమేష్ నాయుడు పాల్గొన్నారు.

గుండెపోటుతో జర్నలిస్టు మృతి

● నివాళి అర్పించిన ఎమ్మెల్యే మురళీనాయక్



గొర్రె చిట్టిబాబు (ఫైల్)

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ సీనియర్ జర్నలిస్ట్ మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పాతబజారు కాలనీకి చెందిన గొర్రె చిట్టిబాబు(55) ఓ దిన పత్రికలో కొంతకాలంగా క్రైం జర్నలిస్ట్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని, ఇంటికి వచ్చి భోజనం చేసిన అనంతరం చాతిలో నొప్పివస్తుందని ఒక్కసారిగా కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు మూడు దశాబ్ధాలుగా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో పనిచేశారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా అందరిని ఆప్యాయతగా పలకరిస్తూ మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రధాన ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. మృతునికి భార్య స్వరూప కుమారుడు అంబేద్కర్, కూతురు అరుంధతి ఉన్నారు. జర్నలిస్ట్‌చిట్టిబాబు హఠాన్మరణం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఎంతన్ రామరాజు, లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం, బానోత రవికుమార్, గొడుగు శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


హనుమకొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వరంగల్ ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హనుమకొండలో వాయినం ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

సంబరంగా సద్దుల పండుగ

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళా లోకం
- వెల్లువలా పూల జాతర
- సప్తవర్ణ శోభితమైన పద్మాక్షి ప్రాంగణం
- ఉమ్మడి జిల్లాలో జోరుగా సద్దుల సందడి


హనుమకొండ పద్మాక్షి ఆలయ ప్రాంగణంలో..


హనుమకొండలో


బతుకమ్మను నీటిలో వదులుతున్న మేయర్ సుధారాణి




వరంగల్‌లో బతుకమ్మను ఎత్తుకొని వస్తున్న మహిళలు


వరంగల్‌లో బతుకమ్మను వదులుతున్న యువతి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజుల పాటు ఆట పాటలతో సాగిన బతుకమ్మల ప్రధాన ఘట్టమైన సద్దుల సందడితో ఉమ్మడి జిల్లా పులకరించి పోయింది. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు సంబురంగా జరుపుకున్నారు. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా మహిళలంతా సమైక్యతను ప్రదర్శిస్తూ తటాకాల వద్దకు చేరుకొని ఆటపాటలతో సందడి చేస్తూ సద్దుల పర్వానికి శ్రీకారం చుట్టారు.

నగరంలోని హనుమకొండలో ప్రధానమైన పద్మాక్షి ఆలయ పరిసరాలకు సాయంత్రం 4 గంటల నుంచే మహిళలు బతుకమ్మలతో రావడం మొదలైంది. నగరంలోని బ్రాహ్మణవాడ, కుమార్‌పల్లి, కొత్తూరు, రాగన్న దర్వాజ, మచిలిబజార్, ఎక్సైజ్‌కాలనీ, రెవెన్యూ కాలనీ, కిషన్‌పురా తదితర అనేక ప్రాంతాల నుంచి మహిళలు జట్లు జట్లుగా పద్మాక్షి ప్రాంగణానికి 7 గంటల వరకుకూడా వస్తూ కనిపించారు. తీరొక్క పూలతో సందడి చేసిన బతుకమ్మలపై గౌరమ్మలను కొలువుదీర్చి అందంగా పేర్చిన బతుకమ్మలను చేబూని పద్మాక్షి ప్రాంగణానికి తరలివెళ్లారు. సద్దుల సంబరాల కోసం అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. పోలీసు యంత్రాంగం మహిళా పోలీసులను రంగంలోకి దింపి బందోబస్తు నిర్వహించారు. నగరపాలక సంస్థ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసింది.





అన్ని దారులు పద్మాక్షి వైపే

నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి వేలాదిగా మహిళలు పద్మాక్షి ప్రాంగణానికి తరలివచ్చారు. వరంగల్‌లోని పోతన ఆడిటోరియం, ప్రసిద్ధ భద్ర కాళి ఆలయ ప్రాంగణం, ఉర్సు కరీమాబాద్‌లోని రంగలీలా మైదానం, వరంగల్ కోట, కాజీపేటలోని వడ్డెపల్లి చెరువుకట్ట, కాశీబుగ్గలోని కోటి లింగాల దేవాలయం. కీర్తినగర్‌లోని కట్టమల్లయ్య ఆలయ ప్రాంగణం, సోమవారం నాటి సద్దుల బతుకమ్మ వేడుకలకు వేదికలుగా నిలిచాయి. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి వరంగల్ పోతన నగర్‌లో, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమా వడ్డెపల్లి, దేవాదాయ శాఖ ఏసీ రామాల సునీత భద్రకాళిలో, వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి రడ్డెపల్లిలో బతుకమ్మలను ఆడారు. వీనితో పాటు అనేక మంది అధికారులు కూడా సంప్రదాయంగా నగరంలో జరిగిన సద్దుల వేడుకల్లో పాల్గొన్నారు.

వాయినాలు

సద్దుల బతుకమ్మలను తటాకంలో నిమజ్జనం చేసే ముందు 'తంగేడు పూవుల్ల చందమామ, మల్లెప్పుడొస్తావు చందమామ' అని పాడుకుంటూ మాయమ్మ లక్ష్మీ దేవి పోయిరావమ్మా అంటూ పిండితో చేసిన ప్రమిదలో నూనె పోసి వెలిగించిన జ్యోతులను నిమజ్జనానికి ముందు బతుకమ్మలపై అలంకరింపజేసి నిమజ్జనానికి తరలించారు. అలా నీటిలో తేలియాడే దీప కాంతులతో ఆ ప్రాంతమంతా ప్రత్యేక శోభను సంతరింపజేసుకుంది. బతుకమ్మలను అనేక మంది మహిళలు వాహనాలపై కూడా తరలించిన దృశ్యాలు కనిపించాయి. పద్మాక్షి మైదాన ప్రాంతమంతా మహిళల పాటలు వినిపించకుండా డీజే పాటల హోరు ప్రతిధ్వనించింది. బతుకమ్మలను నిమజ్జనం చేసే ముందు మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఇంటి వద్ద చేసిన పిండి వంటలను వాయినాలు ఇచ్చి పసుపు కుంకుమలను ముత్తైదువలకు ఇస్తూ సద్దులను పంచే దృశ్యాలు బతుకమ్మల సంస్కృతిని చాటాయి. అలాగే, ఉమ్మడి జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్, జనగామ, ములుగు, భూపాలపల్లి తదితర జిల్లా కేంద్రాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ సద్దుల వేడుకలు సోమవారమే ఆడంబరంగా జరుపుకున్నారు. నగరంలోని అనేక అపార్ట్‌మెంట్‌లలో మహిళలు బతుకమ్మలను సందడిగా ఆడుకున్నారు.


జనగామ జిల్లా పాలకుర్తిలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే యశస్విరెడ్డి


జనగామ జిల్లా కేంద్రం బతుకమ్మ కుంట మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


భూపాలపల్లి పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో బతుకమ్మ వేడుకలు


మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బతుకమ్మను ఎత్తుకున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్


మహబూబాబాద్ బతుకమ్మ విగ్రహం వద్ద ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


వరంగల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హనుమకొండలో..


వరంగల్‌లో బతుకమ్మతో యువతి..


వరంగల్‌లో బతుకమ్మతో వస్తున్న మహిళ


భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో బతుకమ్మ వేడుకలు

జఫర్‌గడ్ ఎస్సై రాంచరణ్ సస్పెన్షన్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి వెస్ట్‌జోన్‌లోని జఫర్‌గడ్ ఎస్సై రాంచరణ్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతికి పాల్పడడంతో పాటు బాధితులకు సకాలంలో న్యాయం చేయకపోవడం, భూ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నాడని పలువురు బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సుబేదారి ఎస్సై రామారావును నియమించారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా అమృతరావు నియామకం



వరంగల్ లీగల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా (అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్) రొడ్డ అమృతరావును నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ పదవిలో ఆయన మూడు సంవత్సరాలపాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆయన వరంగల్ జిల్లా కోర్టులో గత 20 సంవత్సరాలుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన ఎంపికపట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

బతుకమ్మ సంబురాల్లో చిన్నారికి ఫిట్స్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పద్మాక్షిగుట్ట వద్ద సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో 18 నెలల చిన్నారికి ఫిట్స్ వచ్చి పడిపోయింది. హనుమకొండ ఎస్సై కిషోర్ హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కొత్తూర్‌జెండాకు చెందిన సింధుప్రియ తన ఇద్దరు పిల్లలతో సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైంది. అప్పటికే అనారోగ్యంతో ఉన్న అక్షిత 18 నెలల చిన్నారికి ఫిట్స్ వచ్చి స్పృహ తప్పడంతో అక్కడే ఉన్న ఎస్సై కిషోర్ చిన్నారిని తన భుజంపై వేసుకొని వస్తుండగా కానిస్టేబుల్ రమణాకర్ ద్విచక్రవాహనానికి దారి ఇచ్చేందుకు వేలాదిగా ఉన్న మహిళలను జరుపుకుంటూ ద్విచక్ర వాహనం ముందు హనుమకొండ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఆంజనేయ దేవాలయం వరకు పరుగెత్తుకుంటూ వచ్చా డు. అక్కడే సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు పరీక్షించి వైద్యం అందించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉంది.


ఆస్పత్రిలో చిన్నారిని చేర్పించిన ఎస్సై కిషోర్

దుర్గామాత అలంకరణలో సద్దుల బతుకమ్మ

బయ్యారం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో దుర్గామాత ఆకారంలోని ఓ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక కాకతీయ నగర్‌కు చెందిన మారం హైమావతి అనే మహిళా దుర్గామాత ఆకారంలో రంగు రంగు పూలతో బతుకమ్మను పేర్చింది. వినూత్నంగా ఆలోచించి శిరస్సుతో పాటు ఏడు చేతుల్లో ఏడు బతుకమ్మలను పేర్చారు. కాగా గాంధీ సెంటర్‌లోని వేడుక వద్దకు వచ్చిన దుర్గామాత ఆకారంలోని సద్దుల బతుకమ్మను చూసిన ప్రజలు, మహిళలుకు సాక్షాత్తు దుర్గామాతే వేడుకలకు వచ్చిందా.. అన్నట్లు చర్చించుకున్నారు. దీంతో పలువురు మహిళలు బతుకమ్మతో సెల్ఫీ తీసుకున్నారు.


బయ్యారంలో దుర్గామాత అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సద్దుల బతుకమ్మ

విధులు.. బాధ్యత



మానుకోట ఎన్టీఆర్ స్టేడియం బతుకమ్మ వేడుకల్లో ఓ మహిళా కానిస్టేబుల్ చిన్నారిని ఎత్తుకుని మరీ విధులు నిర్వహించింది. ఒకవైపు విధులు.. మరోవైపు చిన్నారి బాధ్యతలు చూస్తూ ఆదర్శ మహిళగా నిలిచింది.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్

6న మందకృష్ణకు సన్మానం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 6న కేయూలో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగను సన్మానించనున్నట్లు కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోడేటి శ్రీనివాస్, ఎస్.సుజాత తెలిపారు. ఈ మేరకు సోమవారం కేయూ గెస్ట్‌హౌస్‌లో ఎంఈఎఫ్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్, సుజాతలు మాట్లాడారు. సమాజంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సాధించి అసమానతలను తొలగించేందుకు కృష్ణమాదిగ కృషి గొప్పదన్నారు. పద్మశ్రీ పురస్కారం లభించడం అణగారిన వర్గాలకుదక్కిన గౌరమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేతలు రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, మంద శ్యామ్, సుమన్, మహర్షి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన రైతు బిడ్డ

రఘునాథపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు బిడ్డ గ్రూప్-2లో సత్తాచాటింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామానికి రైతు మల్లారెడ్డి కూతురు కంసాని శ్రావణి (చెవిటి) గ్రూప్-2లో 185 ర్యాంక్ సాధించి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రావణి, గ్రూపు-2లో సత్తా చాటింది.



గ్రూపు-1లో సత్తా చాటిన అరుంధర్‌రావు



నర్మెట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 పరీక్షల్లో సత్తా చాటి గద్దల అరుంధర్ రావు ఎంపీడీవోగా ఉద్యోగ అర్హత సాధించాడు. నర్మెట మండలంలోని గండిరామవరం గ్రామానికి చెందిన అమృతరావు - కవిత న్యాయవాదుల దంపతుల పెద్ద కుమారుడు అరుంధర్ రావు హైదరాబాద్‌లోని నారాయణ స్కూల్‌లో పదో తరగతి, నారాయణ కాలేజ్‌లో ఇంటర్, శ్రీనగర్‌లో ఎన్‌ఐటీ చేశాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి వెళ్లకుండా యూపీఎస్సీకి ప్రిపేర్ అయ్యాడు. ఈ క్రమంలోనే గ్రూపు-1 పరీక్షను 2024 అక్టోబర్‌లో రాశాడు. తాజాగా వెలువడిన గ్రూపు-1 ఫలితాల్లో 664 ర్యాంక్ సాధించి ఎంపీడీవోగా అర్హత పొందాడు.

గ్రూపు-2లో మెరిసిన కావేరి



నర్మెట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గ్రూపు-2 ఫలితాల్లో నర్మెట మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన ఏలూరి కావేరి రాష్ట్ర స్థాయిలో 777 ర్యాంకు సాధించి ఎంపీవోగా ఎంపికైంది. ఏలూరి అంజిరెడ్డి సరితల పెద్ద కుమార్తె కావేరి గతంలో గ్రూపు-4లో సత్తాచాటి జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. జనగామలో విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేరు అవుతూవచ్చింది. గ్రూపు-3లో కూడా అర్హత సాధించింది. ఈక్రమంలోనే గ్రూపు-2 పరీక్ష కూడా రాసింది. తాజాగా విడుదలైన గ్రూపు-2 ఫలితాల్లో సత్తా చాటి ఎంపీవోగా ఎంపికైంది.

ఎక్సైజ్ ఎస్సైగా సిద్దెంకి యువకుడు



జనగామ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం సిద్దెంకి గ్రామానికి చెందిన యువకుడు ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. 28న విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో గ్రామానికి చెందిన సుంకరి నిర్మల-శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమారుడు కేదారీశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 112వ ర్యాంకు సాధించి ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. ప్రస్తుతం జనగామలోని పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న ఆయన ఏడాది పాటు కష్టపడి చదివి గ్రూప్-2కు ఎంపికయ్యాడు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శివ



పాలకుర్తి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు ఎస్సైగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు శివ డిప్యూటీ తహసీల్దార్‌గా కూటికంటి శివ ఎంపికయ్యాడు. గ్రూపు 2లో 414 మార్కులతో 25 ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని తిర్మలగిరి గ్రామానికి చెందిన కూటికంటి వెంకన్న, లక్ష్మీ దంపతుల మొదటి సంతానమైన శివ డిగ్రీ చేయగా, 2019లో ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. మంచిర్యాలలో తొలి పోస్టింగ్ సాధించగా ప్రస్తుతం మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా శివ పని చేస్తున్నాడు. అంతకు ముందు 2017లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో (ఎఫ్‌సీఐ) జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం, 2018లో ఆర్పీఎఫ్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉద్యోగంచేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. తండ్రి వెంకన్న వ్యవసాయం, తల్లి లక్ష్మీ గృహిణి.

పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా..!



పది ఫీట్ల బతుకమ్మతో పర్కాల హేమలత- శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్‌ప్రదీపరెడ్డి-ఇంద్రనీల్‌రెడ్డి దంపతులు



సెవెన్ హిల్స్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తొర్రూరులో బతుకమ్మతో వస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



బతుకమ్మతో రామసహాయం వెంకట్‌రెడ్డి-ఉమ



బతుకమ్మతో మాజీ వార్డు కౌన్సిలర్ యాళ్ల పుష్పలతరెడ్డి, సాధనారెడ్డి



గూడూరు బ్రహ్మణపల్లిలో బతుకమ్మతో కాంగ్రెస్ నాయకులు బుడిగె సతీష్‌గౌడ్



సద్దుల బతుకమ్మ పేరుస్తున్న గుడిపుడి మంజులనవీన్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని నిజాం చెరువు, బంధం చెరువు, ఎన్టీఆర్ స్టేడియం వద్ద గౌరమ్మను పసుపు, కుంకుమలతో పూజించిన మహిళలు ఒకరి కొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకొని ఇక వెళ్లి...రావమ్మ. బతుకమ్మ అంటూ నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ పండుగకు రెండు, మూడు రోజుల ముందునుంచే తంగేడు, గునుగు, చామంతి, టేకు, బంతిపూలతో సేకరించిన మహిళలు పెద్ద సైజుల్లో బతుకమ్మలను అందంగా పేర్చారు. భారీ బతుకమ్మలను పేర్చేందుకు మహిళలు పోటీపడ్డారు. పట్టణ పురవీధుల గుండా మహిళలు బతుకమ్మలతో బయలుదేరడంతో దారులన్ని పూలవనంగా మారాయి. మరికొంత మంది తమ స్వంత వాహనాలు, ఆటో రిక్షాల్లో బతుకమ్మలతో ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకు న్నారు. ఎన్టీఆర్ స్టేడియం, నిజాం చెరువు, బంధం చెరువుల వద్ద రాత్రి 8 గంటల వరకు మిరమిట్లు గొలిపే రంగురంగుల విద్యుత్ కాంతుల నడుమ మహిళలు భక్తిశ్రద్ధలతో సద్దుల బతుకమ్మ పండుగను అంగరం గ వైభవంగా జరుపుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన మహిళ లతో ఎన్టీఆర్ స్టేడియం కిక్కిరిసిపోయింది. ఈ వేడుకల్లో డీజే సౌండ్ సిస్టమ్ బతుకమ్మ పాటలకు మహిళలు, యువతులు కోలాటం వేశారు. అనంతరం స్టేడియం సమీపంలోని బతుకమ్మఘాట్‌వద్ద ఉన్న నిజాం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన బతుకమ్మల వేడుకలకు స్థానిక శాసనసభ్యులు భూక్యము రళీనాయక్ , ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కాగా జిల్లా కేంద్రంలో గత 27 ఏళ్లుగా పర్కాల పూలమ్మ కుటుంబ సభ్యులు పర్కాల హేమలత-శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్‌ప్రదీపరెడ్డి-ఇంద్రనీల్‌రెడ్డి దంపతులు పది పీట్ల పెద్ద బతుకమ్మను పేర్చారు. పట్టణంలోని సెవెన్ హిల్స్ కాలనీ సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించి సెవెన్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో బతుకమ్మ లను తీసుకువెళ్లి నిజాంచెరువులో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో మహిళా కమిటీ సభ్యులు కోటా నిర్మలారెడ్డి, ఉప్పల పద్మ, బండారు శ్రీలత, తోట శిరీష, రచ్చ సుజాత, సువర్ణ, విజయలక్ష్మీ, మంజులారెడ్డి, నందినిరెడ్డి, అరుణ, రాధిక, ఉష, జ్యోతి, శ్రీలక్ష్మీ, శ్రీదేవి, అరుణ పాల్గొన్నా రు. హౌజింగ్‌బోర్డు కాలనీలో 17వవార్డు కౌన్సిలర్ యాళ్ల పుష్పలతరెడ్డి, యాళ్ల సాధనారెడ్డి బతుకమ్మను పేర్చారు.

● మరిపెడ : తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ వేడుకని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మరిపెడబంగ్లాలోని మండల్ పరిషత్ ఆఫీస్‌లో దేవీశరన్నవ రాత్రుల ఉత్సావాలు, సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగగా, రాంచంద్రునాయక్ పాల్గొని దుర్గామాతకు పూజలు చేసి, సద్దుల బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, అంబరీశ, శ్రీపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఐలిమల్లు, తాజ్‌ద్దీన్, రాంలాల్, సురేందర్‌రెడ్డి, బోర మల్లయ్య, రవికాంత్, ప్రమోద్, వేణు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

● చిన్నగూడూరు : మండలంలోని పగిడిపల్లిలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం సద్దుల బతుకమ్మ సందర్భంగా బాపు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో బెస్ట్ బతుకమ్మ దుండి సంపూర్ణగౌతమ్‌కు డాక్టర్ దుండి అశోక్, వాసం వీరన్నలు బహుమతి అందజేశారు.

●బయ్యారం : బయ్యారం మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని శివాలయం, గాంధీ సెంటర్, రంగాపుర ముత్యాలమ్మ, కాకతీయ నగర్, రామాలయం, బస్టాండ్ సెంటర్, జగ్గుతండాతో పాటు పలు ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే

తొర్రూరు :తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఘనంగా ముగిశాయి. మహిళలు అందంగా బతుకమ్మలను పేర్చి చెరువు దగ్గరికి తీసుకువచ్చి కోలాటాలు, బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, గంజి విజయ్‌పాల్ రెడ్డి, బాపురెడ్డి, మేకల కుమార్, సురేష్ శ్రావణ్ ఉన్నారు. మాజీ మునిసిపల్ కౌన్సిలర్ దొంగరి రేవతి శంకర్ మాట్లాడుతూ మహిళలకు ఎంతో ఇష్టమైన పండుగ బతుకమ్మ అని బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

● గూడూరు మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. గూడూరులో హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక లైటింగ్, సౌండ్‌సిస్టం ఏర్పాటు చేశారు. బ్రహ్మణపల్లిలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బుడిగే సతీష్‌గౌడ్-మానస కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి, సిబ్బందితో పర్యవేక్షించారు.

● డోర్నకల్ సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. జయశంకర్ మునిసిపల్ పార్కులో బతుకమ్మ ఆడుకునేందుకు మునిసిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతరం బతుకమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. అందంగా పేరి తీసుకువచ్చిన బతుకమ్మలకు బహుమతులు అందించారు.

● కురవిలో సద్దుల బతుకమ్మ వేడుకలను కురవి పెద్ద చెరువు వద్ద ఘనంగా నిర్వహించారు. మహిళలు పూలతో పేర్చిన బతుకమ్మ ఆట... పాటల అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అవిరె మోహన్‌రావు, తుకారంనాయక్, బాలగాని శ్రీనివాస్, దడిగెల శరత్ పాల్గొన్నారు.

● మరిపెడ మండలంలో అన్నీ గ్రామాలు, తండాలలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అన్నీ రకాలు పూలతో ఆయా గ్రామాల దేవాలయాలలో ఎంపలి చెట్టును చుట్టూర బతుకమ్మలను పెట్టి మహిళలు ఆడి, పాడారు. అనంతరం బతుకమ్మలను చెరువులలో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుడిపుడి మంజుల నవీన్‌రావు, రామడుగు అచ్యుత్‌రావు, గిరిపురం శాస్త్రీ, ఆయా గ్రామాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

● కేసముద్రం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మహిళలు ఆనందోత్సహాల నడుమ బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

● బయ్యారం మండలంలోని శివాలయం, గాంధీసెంటర్, రంగాపురం ముత్యాలమ్మ రామాలయం, బస్టాండ్ సెంటర్, కాకతీయ నగర్, జగ్గుతండతో పాటు మండల వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కోలాటాలు ఆడారు.

● ఇనుగుర్తి మండల కేంద్రంతో అన్ని గ్రామాల్లో మహిళలు పూలతో బతుకమ్మలను పేర్చి ఒకచోట పెట్టి ఆట.. పాటల నడుమ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం ఆయా చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● గార్లతో పాటు మండల పరిధిలోని బుద్ధారం, ముల్కనూరు, సీతంపేట, పుల్లూరు, పోచారం, రాంపురం, మద్దివంచ గ్రామాల్లోని బతుకమ్మ ఘాట్‌ల వద్ద మహిళలు ఒకే చోట చేరి తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుక వచ్చి డీజే ఆట పాటతో డ్యాన్సులు చేస్తూ పాటలు పాడుతూ సందడి చేసి సంబరాలను వైభవంగా నిర్వహిం చారు. అనంతరం బతుకమ్మతో వచ్చిన మహిళలకు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం బతకమ్మలను పాకాల ఏటిలో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

● నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నెల్లికుదురులో సద్దుల బతుకమ్మ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి డాక్టర్ సీతామహాలక్ష్మి హాజరయ్యారు. గ్రామస్తులు చెరువుల వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆటస్థలాలకు మహిళలు వెళ్లి బతుకమ్మల చుట్టూనృత్యాలతో డీజే బతుకమ్మపాటలతో సంబరాలు చేసుకున్నారు. అనంతరం బతుకమ్మలను చెరువులలో వదిలిపెట్టారు. రకరకాల రుచులతో తయారుచేసిన పలహారాలను ఒకరికొకరు పంచుకున్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో మాట్లాడుతున్న మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



ఎన్టీఆర్ స్టేడియంలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు



నెల్లికుదురులో 8 ఫీట్ల బతుకమ్మను ఊరేగిస్తున్న గ్రామస్తులు



అనంతారంలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు



కురవి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విప్ రాంచంద్రునాయక్



గార్ల పాకాల ఏటి వద్ద బతుకమ్మలతో మహిళలు



చిన్నగూడూరు పగిడిపల్లిలో విజేతలకు బహుమతులు ఇస్తున్న దుండి అశోక్, వీరన్న

స్థానిక సమరానికి సై

(5వ పేజీ తరువాయి)

ప్రయత్నాలు ఆరంభించారు. వీరికి తగ్గట్టుగానే ఓటర్లేం తక్కువ కాదన్నట్టు ఆశావహ నాయకులు ఎదురుకాగానే సర్పంచ్ సాబ్.. ఎంపీపీ.. జడ్పీటీసీ అంటూ నేరుగా వారిని అందలం ఎక్కిస్తూ తమ పబ్బం గడుపుకునే ప్రయత్నాలు కూడా చేస్తూనే ఉన్నారు. పదవి వస్తుందో.. రాదో కానీ ఓటరు పిలుపుతో నాయకులు ఉబ్బి తబ్బిపోతున్నారు. ఆ సీటులో కూర్చున్నట్లే ఫీలవుతూ.. అప్పటికప్పుడే సిట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. దసరా పండుగ నాడే గాంధీ జయంతి వస్తుండడంతో మందు.. నాన్‌వేజ్ దొరకని పరిస్థితి ఎదురవుతుందని ముందస్తుగానే గ్రామీణులు ఎక్కువగా తీసుకునే వివిధ రకాల బ్రాండ్‌ల మందును కొనుగోలు చేసి ఆ రోజు ఇచ్చేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. యావత్ కుటుంబాన్ని ఖుషీ చేసేందుకు మటన్, చికెన్, ఫిష్ లాంటివి ఇంటింటికీ ప్యాకెట్‌లు అందించేందుకు నేతలు ఇప్పట్నుంచే ఆర్డర్‌లిస్తున్నారు.

గత ఎన్నికలకు.. రేపటి ఎన్నికలకు..

గత ఎన్నికల సమయంలో 196 ఎంపీటీసీలు, 16 జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించగా.. పరిపాలన సౌలభ్యం.. కొత్త మునిసిపాలిటీ, మండలాల ఏర్పాటుతో సంఖ్య చిత్రం మారిపోయింది. కేసముద్రం మునిసిపాలిటీగా ఆవిర్భవించడంతో ఆ పరిధిలోని మూడు ఎంపీటీసీ స్థానాల గ్రామాలను కేసముద్రం మునిసిపాలిటీలోకి చేర్చడంతో జిల్లాలో ఎంపీటీసీల సంఖ్య 193కు తగ్గిపోయింది. ఇక 16 మండలాల నుంచి కొత్తగా సీరోలు, ఇనుగుర్తి మండలాలు ఆవిర్భవించడంతో జడ్పీటీసీల సంఖ్య 18కి పెరిగింది. ఈ స్థానాల ఎన్నికల కోసం జిల్లా అధికార యంత్రాంగం 63 మంది రిటర్నింగ్ అధికారులు, 8 మంది రిజర్వుడ్ అధికారులతో కలిపి మొత్తం 71 మంది, 63 మంది అసిస్టెంట్ అధికారులు, 8 మంది రిజర్వుడ్ అధికారులతో కలిపి మొత్తం 71 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో పాటు 12 మంది నోడల్ ఆఫీసర్లను నియామకం చేసింది. దీంతో పాటు 5858 మంది పోలింగ్ సిబ్బందిని ఎన్నికల్లో వాడుకునేందుకు శిక్షణ పూర్తి చేసింది. 1066 పోలింగ్ స్టేషన్‌లను ఎంపిక చేసింది. 2553 పోలింగ్ బాక్సులను సిద్ధం చేసింది.

42 శాతం బీసీ రిజర్వేషన్‌లతో...

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం 42 శాతం బీసీల రిజర్వేషన్లతో జడ్పీ చైర్మన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్‌ల రూపురేఖలు మారిపోయాయి. మహబూబాబాద్ జిల్లా ఆవిర్భావ తొలి జడ్పీ చైర్‌పర్సన్ ఎస్టీ మహిళకు రిజర్వు కాగా, రెండోసారి జరుగనున్న ఎన్నికల్లో (ఈసారి) ఓసి జనరల్‌కు అవకాశం లభించడంతో ఓసీలతో పాటు అన్ని వర్గాలను చైర్మన్ పదవీ దక్కించుకోవాలని ఉత్సాహం ఉవ్విలూరుతోంది. తాజా రిజర్వేషన్ల ప్రకారం.. జిల్లాలో 18 జడ్పీటీసీలకు గాను బీసీ జనరల్ 4, బీసీ మహి ళ 3, ఎస్టీ జనరల్ 4, ఎస్టీ మహిళ 3, అన్ రిజర్వుడ్ జనరల్ 1, అన్ రిజర్వుడ్ జనరల్ మహిళ 1, ఎస్సీ జనరల్ 1, ఎస్సీ మహిళకు 1 చొప్పున కేటాయించారు. ఎంపీపీల్లో ఎస్టీ జనరల్ 5, ఎస్టీ మహిళ 4, బీసీ జనరల్ 3, బీసీ మహిళ 3, అన్ రిజర్వుడ్ జనరల్ 1, ఎస్సీ మహిళ 1, ఎస్సీ జనరల్ 1 చొప్పున కేటాయించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు

నెల్లికుదురు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సింగారపు కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కోడ్ అమలులోకి వచ్చిందని గ్రామాలలో వాల్‌పోస్టర్లు తొలగించాలన్నారు. గోడలపై రాతలను తొలగించాలని తెలిపారు.

చనిపోయిన వారికి విధులు కేటాయించడం విడ్డూరం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల విధులకు చనిపోయిన ఉపాధ్యాయుడికి ఆర్డర్ జారీ చేయడం విడ్డూరంగా ఉందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బలాష్టి రమేష్, విష్ణువర్దన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్, డీపీవో హరిప్రసాద్‌కు వేర్వేరుగా వినతి పత్రం అందజేశారు. ప్రతీ ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ సంఘాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల కేటాయించే సందర్భంలో ప్రత్యేక అవసరాలు గల ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులు, ఆరు నెలల లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని తెలుపుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికల విధులు కేటాయించే సమయంలో అధికారులు ఉద్యోగ, ఉపాధ్యాయుల తాజా సమాచారాన్ని తెప్పించుకోవడంలోనూ.. సమాచారం ఇచ్చే వారి నిర్లక్ష్యం వల్లనో కావచ్చు కానీ ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పదవీ విరమణకు దగ్గరలో ఉన్న, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో రాచకొండ ఉపేందర్, రవీందర్, వీరస్వామి, సురేష్, వెంకట్రాంనర్సయ్య, సుధాకర్, లక్ష్మణ్‌రావు, ఎల్లయ్య, సోమయ్య పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి..

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల శిక్షణకు హాజరుకాని ఉపాధ్యాయులకు దసరా సెలవుల అనంతరం శిక్షణ ఇవ్వాలని టీఎస్-యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి యాకూబ్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. దసరా సెలవులు ఉండడం వలన ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లారని, వారు నిర్ణీత సమయంలో హాజరుకాని ఉద్యోగులకు మరో రోజు శిక్షణ ఇవ్వాలని కోరారు. అనారోగ్యం, ఫీడింగ్ తల్లులకు, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. హరినాయక్, భద్రునాయక్, సురేష్, శంకర్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

నిరంతరం శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో నిరంతరం శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని నలంద విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాదలో సోమవారం గ్రూపు-2లో ఉత్తమ ర్యాంకు సాధించి మునిసిపల్ కమిషనర్ గ్రేడ్-2 పోస్టుకు ఎంపికైన మల్లారి పద్మను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళ్లెం వీరారెడ్డి, పమ్మిరాజు, మద్దెల రమేష్, దుప్పటి శ్రీనివాస్, మెంతుల శ్రీనివాస్, ఏనుగుతల ఉప్పలయ్య, చొప్పరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజేష్‌కు గ్రూప్-2లో 343వ ర్యాంకు

కురవి మండలం మోద్గులగూడెం గ్రామానికి చెందిన రడం రాజేష్ గ్రూప్-2లో మెరుగైన ర్యాంకు సాధించారు. 343 ర్యాంకుతో టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించారు. రడం వీరన్న-సావిత్రి దంపతుల కుమారుడైన రడం రాజేష్ గతంలో పంచాయతీ కార్యదర్శిగా, రెండు ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా, గ్రూప్‌-4లో ఎస్పీ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. గ్రూప్-3 ఫలితాల్లో సైతం స్టేట్ 253వ ర్యాంకు సాధించాడు.

ర్యాంకర్‌కు సన్మానం

కేసముద్రం : మండలంలోని మహమూద్‌పట్నంలో కొద్దినెలల క్రితం గ్రూప్-1లో ఎంపీడీవోగా ఎంపికైన గూడెల్లి విష్ణును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు మిట్టగడుపుల యాకూబ్, మాజీ ఎంపీటీసీ ముంజాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మూడావత్ శంకర్, కాసోజు రాజన్న, సిలువేరు లింగయ్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



హచ్చమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సురేష్‌నాయక్

కొత్తగూడ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మాసంపల్లిలో మృతురాలు అంగోత్ హచ్చమ్మ కుటుంబానికి తాటివారివేంపల్లి మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ సురేష్ నాయక్ ఆర్థికసాయం చేశారు. మాసంపల్లి గ్రామానికి చెందిన అంగోత్ హచ్చమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. హచ్చమ్మ మృతదేహం వద్ద మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ సురేష్ నాయక్ నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరమార్శించి సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ సురేష్ నాయక్ మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

కులవ్యవస్థ నిర్మూలనకు పోరాడుదాం

● మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజల ఐక్యతకు ప్రధాన అడ్డంకిగా మారిన కులవ్యవస్థ నిర్మూలన కోసం ప్రజలంతా సంఘటితంగా పోరాడాలని మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఓట్లు, సీట్ల రాజకీయ అధికారం కోసం పాలకవర్గ పార్టీలు కులవ్యవస్థను పెంచి పోషిస్తున్నాయన్నారు. ఆవుల కట్టయ్య, ఉమ్మగాని సత్యం, జానకిరాములు, వీరస్వామి, సిరి, అంజయ్య, పవన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండ్లను పూడ్చాలని ఎమ్మెల్యేను నిలదీసిన గ్రామస్థులు



ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్థులు

నెల్లికుదురు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రావిరాల గ్రామంలో గతంలో చెరువుకట్టకు గండిపడడంతో గండిపూడ్చాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్‌ను సోమవారం గ్రామస్థులు నిలదీశారు. రావిరాల గ్రామంలో పాఠశాల భవన నిర్మాణంకోసం భూమి పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే మురళీ నాయక్ హాజరయ్యారు. ఈ క్రమంలో గ్రామస్థులు నిలదీశారు. కట్ట మరమ్మతులు త్వరలో చేపడుతామని ఎమ్మెల్యే మురళీనాయక్ హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.